ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2017

సంపుటి : 23 **265** సంచిక : 2

చతుర్వేద వాగ్విభవమ్ తెలుగు భాష! రాజాను మతధర్మంగా విభ్రాజిల్లింది!

అప్పటి రాజులు మాతృభాష చిరకాలం వర్ధిల్లాలని తొలి ప్రాధాన్యమిచ్చారు!

రాజధర్మం ప్రజాధర్మ బద్ధంగా ప్రవర్ధిల్లాలను సదుద్దేశంతో, భాషను కవులను పోషించారు!!

సత్యధర్మ నిబద్ధంగా ప్రజలు నడుచుకోవాలంటే ముందు రాజులు ధర్మమూర్తులై ఉండాలి. రాజులు ఆచరించిన ధర్మాన్నే ప్రజలూ ఆచరించేవారు. రాజానుమతం ధర్మంగా ప్రజలు నడిచారు. యధారాజా తధా ప్రజా– అన్న ఆర్యోక్తి అంతరార్థం అదే!

రాజరాజనరేంద్రుడు పూర్వుల 'మతం ధర్మము' పునరుద్ధరించాలని భావించి తన ఆస్థాన కవి నన్నయ భట్టారకుణ్ణి మహాభారత రచనకుపక్రమింప చేసాడు. ఆయన ఆది. సభా పర్వములను ఆంధ్రీకరించారు. అరణ్యపర్వ రచనా కాలంలో ఆయన కాలం చేసారు.

అనన్తరమ్ ఎన్నో ఏళ్లకు రాజు ప్రేరణతో తిక్కన తదుపరి పర్వాలను రచించారు. కానీ శేషించిన అరణ్యపర్వమును ఆయన స్పృశించలేదు. కొన్నేళ్లకు ఎఱ్ఱాప్రెగడవారు అరణ్య పర్వాన్ని పూర్తి చేసారు. 'మహాభారతం' ముగ్గురు కవులచే మూడు కాలాల్లో పూరింపబడినదన్నది సత్యం. అందు చతుర్వేద సారమైన తెలుగు వాగ్విభవ భాషా చాతుర్యంగా, చరితకు భిన్నంగా కాకుండా ముగ్గురు కవులూ ఆ ఇతిహాస సారాన్ని, గోక్షీరంగా పిండి ధారగా వర్షింప చేసారు.

చతుర్వేద సార విభవమైన 'మహాభారతము' మృదుమధుర పద సుగంధ గుంభితమైన తెలుగు భాష సుధారస సారమని చెప్పాలి.

ఏ పూర్వ పుణ్య భాగ్యమోగానీ తెలుగు వాఙ్మయం ఇతిహాసికంగా ప్రారంభమైంది.

ధర్మమూ, అర్థమూ, కామమూ, మోక్షమూ చతుర్విధ చతుర్వేద ధర్మాలతో పంచమ వేదంగా మహాభారత గ్రంథం వెలువడింది.

తొలిగా, ఆంధ్రీకరణం కావింపబడిన గ్రంథం మహాభారతం. ఆంధ్రీకరించిన మహాకవి నన్నయ భట్టారకుడు, ఆయన్ను ఆంధ్రీకరించుటకు ప్రోత్సహించిన ప్రభువు రాజరాజ నరేంద్రుడు. పూర్వుల ఇతిహాసమైన కురుపాండవ చరిత్రను సుపరిచతం చేయాలని ఉభయభాషా ప్రవీణుడైన నన్నయను ఆ ప్రభువు ప్రోత్సహించారు. అలా ఆంధ్ర మహాభారతం రాజమహేంద్రవరంలో కావ్య రచనా ఆవిష్కరణం జరిగింది; రాజానుమత ధర్మంగా విభ్రాజిల్లింది. చతుర్వేద వాగ్విభవ మహాభారత ఆంధ్రగ్రంథం పంచమ వేదంగా ప్రస్తుతింపబడింది; చతుర్వేద సుధాసారమైన కావ్యం మహాభారతం పంచమ వేదంగా పరిఢవిల్లిందనుటలో ఎట్టి సందేహమూ లేదు.

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

సాధువు! సాధుశీలుడు ఎలా ఉండాలంటే? విద్యాస్వరూపానందగిరి స్వామిని చూచి చెప్పాలి!

ఆయన శ్రీకాళహస్తీశ్వరములోని శుకబ్రహ్మాశ్రమ పీఠాధికారి. 100 ఎకరాల విస్తీర్ణంగల ఆశ్రమం ఆయన ఆధీనంలో ఉంటుంది.

ఎనిమిదిపదులు నిండిన వయస్సు. ముఖబింబంపై పౌర్ణమి శశాంకబింబం వెన్నెలలా చిగురాడే చిరునగవు. ఆయన్ను చూడగానే కష్టాలన్నీ మరిచిపోతాం. ఆ ఆశ్రమంలోని ప్రతీ రేణువూ ఆయన్ను చూచి పులకించిపోతుంటుంది. ఆయన పాదాలకు పాంకోడులుగానీ, పాదరక్షలుగానీ ఉండవు. ఆకాశంపైగల సూర్యుడు అధికార వేడి ప్రౌఢిమను ధూరేణువుల పై కూడా ప్రజ్వలిపంచేస్తూంటాడు.

అలాంటి దుస్థర, దుస్సహన సమయంలో కూడా ఆయన పాదరక్షలు లేకుండా నడుస్తుంటారు. ఆ ఆశ్రమంలో నిర్మింపబడిన నేత్రాలయ మిద్దె నిర్మాణ సమయంలో ఆయన పైకెక్కి పనులను పరిశీలించడం ప్రత్యక్షంగా చూసాను. క్రిందున్న మిద్దె అంచులు మంటలూ, పొగలూ సెగలూ గ్రక్కుతూంది. పైన మార్తాండుడు చండ ప్రచండ వేడిమిని ప్రసరింపచేస్తున్నాడు. ఆ ఆశ్రమానికి ఉన్న ఆస్తి కోట్ల విలువ ఉంటుంది. అయినా ఆయన సాధారణ కాషాయ వస్త్రములనే ధరిస్తారు. ఆర్భాటాలు ఉండవు.

అక్కడ నేత్రాలయంలో రోగులకు ఉచిత శస్త్రచికిత్సలే గాకుండా, ఉచిత భోజన వసతి, ఔషధాల్ని కూడా యిస్తారు.

ఎవరైనా ఒక్క రూపాయి విరాళమిచ్చినప్పటికినీ దానికి రశీదు యివ్వాలి. వెంటనే ఆశ్రమ బాంకు అక్కౌంటులో కట్టాలి. సత్యసంధత కల సాధు వరేణ్యుడు. ఆయన పాదపూజలు చేయించుకోరు. వచ్చిన ఆర్తుల ఆర్తిని వింటారు. సర్వసామాన్యంగా అందరితో కూర్చుని భిక్షను స్వీకరిస్తారు. ఎవరైనా పండూ ఫలమూ తీసుకుని వస్తే, అక్కడున్న వారికి అలానే పంచుతారు.

రమణ ఋషిలా కర్మయోగి. కంచి పరమాచార్యుల వలె విరాగి! ఇలా ఆయనతో పోల్చదగినవారెవరైనా ఉన్నారా- అనే సందేహం కలుగుతూంటుంది.

ఏంవిటి స్వామీ, నూతన వస్త్రములు, పట్టుబట్టలు యిస్తూంటే ఇలాంటి వే కడతారు? అని అడిగితే సన్యాసికి ఇవన్నీ అవసరమా- అంటారు. ఆశ్రమ ప్రాంగణంలో ఓ మూల పై అంతస్తుకూడా లేని రెండు గదుల చిన్న డాబా యింట్లో వారి విశ్రామం చూస్తూంటే- ఇంత సాధుభరితంగా ఉందేంవిటనే ఆశ్చర్యం కలుగుతూంటుంది. అక్కడున్న సాధారణ బల్లయే వారి శయ్యాగారం. దిండు ఉండదు. పరుపు ఉండదు. కనీసం ఓ దుప్పటియైనా కప్పబడి ఉండదు. అంత సాధారణంగా సామాన్య అతి సామాన్యంగా ఉండే పీఠాధిపతిని నేనెక్కడా చూడలేదు. అంతటి ఆస్తిపాస్తులున్న ఆశ్రమంలో సామాన్యాతిసామాన్యంగా ఉండేవారున్నారా అని ప్రశ్నించుకుంటే లేరు లేరనే చెప్పాలి.

కోటాను కోట్ల సాధుపుంగవుల్లో శ్రీశ్రీవిద్యా స్వరూపానందగిరి స్వామి వారొక్కరేయని- నా జ్ఞాన చక్షువు చెబుతుంది. అమ్మహానుభావుని దయాసాగరంలో నేనూ ఒక బిందువుగా, చివరి శ్వాసవరకూ వారి హృదిలో ఉండాలని పరంధాముణ్ణి అర్థిస్తున్నాను; వారినిప్రార్థిస్తున్నాను. శిరస్సు వొంచి శతథా అనుగ్రహించమని కోరుతున్నాను. ●

మగసిరి కలవాడు! మగువసిరులవాడు నందమూరి తారకరాముడు

నాకు తారకరాముని (ఎన్టీయార్)తో ఓ సన్నిహిత సంబంధం ఉండేది. 'పాతాళభైరవి'లోని తోటరాముని పాత్ర మల్లెల సౌరభాలు విరబూయించింది. అటు తరువాత 'జయసింహ' చిత్రం నిర్మించిన తరువాత, ఓ సాహసిక మార్పుగా 'తోడుదొంగలు' చిత్రాన్ని ఆయనే నిర్మించారు. గ్లామర్ విరుద్ధమైన పాత్ర! ముదుసలి పరమేశంగా జనం ఆయన్ను చూడలేక పోయారు. ఆయన చిత్రనిర్మాణ సంస్థ ఎన్.ఏ.టి. లో ఎందుకలా జరిగిందనే విషయాన్ని రామారావు, ఆయన సోదరుడు త్రివిక్రమరావుల యెదుట కూర్చుని విపులీకరించాను

మిమ్మల్ని జనం గ్లామర్ హీరోగా, 'పాతాళభైరవి'లో తోటరామునిగా చూచి ఆనందించిన విషయాన్ని జనం మరచిపోలేదు- అన్నాను; ఆయన నవ్వారు.

నందమూరి 'తార'క

ఈ ఫోటోలో కనిపిస్తున్న అందమైన అమ్మాయి ఎవరో తారక కాదు. మన నందమూరి తారక రామారావు. తిరుపతి మహానాడు ఫోటో ప్రదర్శనశాలలో ఎన్టీఆర్ అమ్మాయి వేషధారణలో ఉన్న ఫోటో సందర్శకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఏ వేషంలోనైనా అన్నగారు ఇట్టే ఒదిగిపోతారనేది అక్కడివారి కామెంట్. ఆడతనం ఉట్టిపడేలా, తెలుగుతనం తొణికిసలాడేలా కనిపిస్తున్న నాటి ఎన్టీఆర్ లేడీ గెటప్ ఫోటో ఎగ్జిబిషన్‌లోనే స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ●

మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్, బోసు కారణంగా 1947 ఆగస్టు15న స్వాతంత్ర్యం సిద్ధించింది 1956 జనవరి 26న 'ఘన' తంత్రం మహోత్సవం

రెండు శతాబ్దాల బ్రిటీష్ పరిపాలనలో మగ్గిపోయిన భారత దేశానికి 1947 ఆగస్టు 15, స్వాతంత్ర్యం సిద్ధించింది. అంతవరకూ మనదేశ పరిపాలనా విధానం అంతా బ్రిటీష్ రాజ్యాంగం ప్రకారం జరిగింది. సత్యాగ్రహమే ఆయుధంగా, శాంతి మార్గంలో గాంధీ ఇచ్చిన సలహా, బోసు సైనిక పిలుపుతో దేశ ప్రజ యావత్తూ వారి వెంట నడిచి, తెల్లదొరల్ని వెళ్లగొట్టింది. స్వతంత్ర బావుటాని ఎగురవేసింది. ఇక ఈ స్వతంత్ర దేశాన్ని ఏ విధంగా రూపుదిద్దాలా అనే ప్రక్రియలో ఎన్నో తర్జన భర్జనలు చేసారు. 200 సంవత్సరాలు పరాయిపాలనలో అస్తవ్యస్తంగా ఉన్న దేశానికి స్వేచ్ఛాభావాలు కలిగిన భారతీయులకి ప్రజాస్వామ్యమే సరైన మార్గంగా నిర్ణయించారు. రాజ్యాంగ రచనకు శ్రీకారం చుట్టారు. మేధావులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, దానికి డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ని చైర్‌మెన్‌గా నియమించారు. అహర్నిశలూ ఆ కమిటీ ఎంతో శ్రమకోర్చి కుల, మత, వర్ణ, వర్గ, భాషా , ప్రాంతాలకతీతంగా లౌకిక రాజ్యాంగంగా దేశాన్ని రూపొందించారు. అనేక ఇతర దేశాల రాజ్యాంగ విధానాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసారు. అన్నీ పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగం 26 జనవరి 1956లో అమలులోకి వచ్చింది. డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ తొలి రాష్ట్రపతిగా మనదేశం పూర్తి గణతంత్ర దేశంగా ఆవిర్భవించింది. ఆ రోజు నుండి ఈరోజు వరకూ జనవరి 26న దేశం మొత్తం 'గణతంత్ర దినోత్సవ' (రిపబ్లిక్ డే) వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకుంటున్నాం. ఇలా అభివృద్ధిపథంలో నడుస్తూ 70వ గణతంత్ర వేడుకలు జరుపుకోవటానికి దేశం మొత్తం సమాయత్తమయింది.

ప్రతియేటా జరిగే గణతంత్ర దినోత్సవాలు కేంద్ర ప్రభుత్వంతోపాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఘనంగా జరిపాయి. ఢిల్లీ ఎర్రకోట వద్ద వైభవంగా జరిగిన ఉత్సవాల్లో భారత వైమానికి దళం, నౌకాదళం, పదాతి దళాలు సైనిక ప్రదర్శనలు జరిపాయి. అలాగే దేశంలోని అన్ని ప్రభుత్వ రంగాల నుంచి అనేక సకటాల ప్రదర్శనలు జరిగాయి. రాజలాంఛనాలతో ఈ ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముందుగా సైనిక వందనాన్ని స్వీకరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రతిబింబించే అనేక ప్రాంతాల కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఎర్రకోట మీద రాష్ట్రపతి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, దేశప్రజలనుద్దేశించి ప్రసంగించడం మనం ప్రతిఏటా చూస్తున్నాం. ఈ సంవత్సరమూ అలాగే జరిగింది. గణతంత్ర దినోత్సవ వేడుకలకి ఒక ప్రముఖ దేశాధినేతని అతిథిగా ఆహ్వానించి సత్కరించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఈ సంవత్సరమూ అలాగే జరిగింది. కానీ పూర్ణ స్వతంత్ర దేశంగా ప్రవర్థిల్లింది. ఏంవి సాధించాం అనే ప్రశ్న ప్రశ్నగా ఉండిపోయింది. ధనికుడు ఇంకా ధనికుడవుతున్నాడు. మధ్యతరగతివాడింకా మలమలాడిపోతున్నాడు. ఘనతంత్ర ఫలం ఎవరందుకుంటున్నారో తెలియడం లేదు. ●

మీనాకుమారిని వెండితెరకు పరిచయం చేయడంలో గోటేటి ప్రోత్సాహం, ప్రోద్బలం ఉన్నది

గిరిజ రమాప్రభ మధ్యకాలం (1960–70)లో వెండితెరపై నవ్వులు పూయించిన హాస్యనటి మీనాకుమారి. చిన్న వయసులోనే నెల్లూరు వాస్తవ్యుడైన వై. సుబ్బారావుతో వివాహమైంది. మీనాకుమారి స్వతహాగా అందాలరాశి కావడంతో భార్యకు నటనలో, నాట్యంలో తర్ఫీదు ఇప్పించారు. మీనాకుమారి తొలిచిత్రం ప్రముఖ నటి చంద్రకళ తండ్రి ఎం.ఎస్. నాయక్ నిర్మించిన 'శ్రీరామాంజనేయ యుద్ధం'. ఆ తర్వాత సతీసుకన్య, మనోరమ చిత్రాల్లో నటించినా, సినీ ప్రముఖుల్ని ఆకర్షించింది మాత్రం బి. విఠలాచార్య 'పెళ్లిమీద పెళ్లి' చితత్రం. మీనాకుమారి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అన్నాచెల్లెలు'. వెలుగునీడలు, గులేబకావళికథ, దక్షయజ్ఞం, బందిపోటు, ఏకవీర, బుద్ధిమంతుడు, విచిత్రదాంపత్యం మొదలుగు చిత్రాలు మీనాకుమారికి మంచి పేరు తెచ్చాయి. సుమారు 200 చిత్రాల్లో నటించారు. 'విచిత్రకుటుంబం'లో రాజబాబుకు జంటగా (ఎర్ర ఎర్రానిదానా, బుర్రా బుగ్గల దానా... లస్కో... లస్కో) చాలా మందికి గుర్తుంటుంది. మహానటి సావిత్రి, సురభి బాలసరస్వతిలతో మీనాకుమారి స్నేహంగా ఉండేవారు. ఈమె చివరి చిత్రం 'జీవితంలో వసంతం' (1977) లంగ్ క్యాన్సర్‌తో మీనాకుమారి 13.8.2007న మరణించారు. తెలుగు తెరపై హాస్యం పండించిన గిరిజ, రమాప్రభ, శ్రీలక్ష్మిలతోపాటు మీనాకుమారి సినిమా అభిమానులకు గుర్తుంటారు. ●

మనం మన బాంధవ్యాలను మరచిపోతున్నాం! ప్రేమను పంచుకోలేకపోతున్నాం! వాత్సల్యంగా ఉండలేకపోతున్నాం!

మాతృభాషాధ్యయనం చేయనివారికి బాంధవ్యాలూ, బాంధవ్య సొగసులూ అవగాహనం కావు! పూర్వులు గ్రాహ్యమయ్యేట్లు గేయరూపంలో అందించిన అందమైన సొగసుల్ని ఆస్వాదించాలంటే పాతపాటల పూదోటను వెదకాలి! వొంటబట్టించుకోవాలి! ఆనాటి కుటుంబ సహజీవనాన్ని అవగాహన చేసుకోవడానికీ ఉదాహరణగా చిన్న గీతమునందిస్తున్నాను!

కలవారి కోడలూ – కలికి కామాక్షీ
కడుగుచున్నది పప్పు – కడవలో పోసీ
అప్పుడే వచ్చెను! ఆమె పెద్దన్న
కాళ్లకూ నీళ్ళిచ్చి – కన్నీరు నింపె
ఎందుకమ్మా కన్నీళ్లు– ఏమి కష్టాలూ
తుడుచుకో చెల్లెలా– ముడుచుకో కురులూ!
పోయి మీవారితో చెప్పి రావమ్మా!
–అని అన్న బుజ్జగిస్తాడు.
పట్టె మంచము మీద పడుకున్న మామా
మా అన్నలొచ్చారు మమ్మంపుతారా?
నే నెరుగ నే నెరుగ! నీ అత్తనడుగు!
కుర్చీపీట మీద కూర్చున్న అత్త!
మా అన్నలొచ్చారు మమ్మంపుతార?
నేనెరుగ నేనెరుగ– నీ బావనడుగు!
భారతము చదివేటి బావ! పెదబావ
మా అన్నలొచ్చారు మమ్మంపుతార!
నేనెరుగ నేనెరుగ– నీ అక్క నడుగు
వంటచేసే తల్లి వంటింటి అక్క
మా అన్నలొచ్చారు – మమ్మంపుతారా!
నేనెరుగ నేనెరుగ – నీ భర్త నడుగు!
రచ్చలో కూర్చున్న రాజేంద్ర భోగి
మా అన్నలొచ్చారు – మమ్మంపుతారా!
కట్టుకో చీరను– పెట్టుకో సొమ్ములూ
ఎత్తుకో బిడ్డనూ– ఎక్కు అందలము
పోయి రావమ్మా– నీ వారితో
పుట్టినింటికిని– సుఖముగానూ

–ఆనాటి కట్టుబాట్లను చూడండి. పురుడు పోసుకోవడం కోసం ఎంతమంది కుటుంబ సభ్యులను వినయంగా అడిగి అనుమతి తీసుకుని వెళ్ళేవారో! సాంప్రదాయానికి పెద్దలకూ యిచ్చే మర్యాద! ఆ మర్యాద గౌరవాల్లోనే అందరి ఆశీస్సులను గ్రహించే సౌభాగ్య అంతరార్థం ఉండేది! ఇప్పుడా సాంప్రదాయాన్ని ఎంతమంది పాటిస్తున్నారు? ●

తమిళనాడులో తెలుగు వికాసానికి అహరహం కృషి చేసిన సాధువరదరాజం పంతులు!

తిరునల్వేలి హల్వా కన్నా రుచ్యమైన మాతృభాష తెలుగుభాషను మాట్లాడుతూ, 'మన తెలుగువారందరూ దయచేసి తెలుగులోనే మాట్లాడండి'-అంటూ ఓ ప్రచారపట్టాను భుజానికి తగిలించుకుని కాలికిబలపం కట్టుకున్నట్లు నడుస్తూ కాలిక్రిందనున్న ధూరేణువుల పొరల్లో కూడా తెలుగు భాష అక్షరాలు చొరబడేట్టు తమిళనాడు అంతటా తిరిగిన ఏకవీరుడు సాధువరదరాజం పంతులు.

తమిళనాట ఉన్న తెలుగువారికి తెలిసేట్టుగ తెలుగు పదాలను తమిళంలో వ్రాసి, యెలా ఉచ్చరించాలో బోధించిన మాతృభాషా బోధకుడు. చేత పెద్దబాలశిక్షను పట్టినట్లు, తెలుగు అవలీలగా అవగాహనమయ్యేట్లు శ్రమించిన ఏకవీరుడు.

ఈనాడు వయోజన విద్య అనేట్లు లక్షలూ కోట్లు తగలేస్తున్నారుగానీ, ఆనాడు పంతులుగారు అనాడంబరంగా తెలుగుభాషను మాట్లాడింపచేయడమే గాకుండా చదవడం, వ్రాయడం వంటి, 'విజువల్ ఎడ్యుకేషన్'కు ఆయనొక్కడే నడుముకట్టాడు. ఒక ఊరా, రెండూర్లా- తెలుగు వాళ్ళుండే ప్రాంతాలన్నీ తిరిగాడు.

'కృషితోనాస్తి దుర్భిక్షమ్' అన్నట్టు ఆనాడు నామావశిష్టంగా ఉన్న 'తెలుగు', తెలుగు వాళ్ళ నాలుకలపై లాలాజలంలా ఊరి, ఉబ్బి, ఊరి ఉరకలేసిందన్నట్టు ఉప్పొంగిపోయింది.

గోదావరీలా గలగలా పారింది. తెలుగువారుండే తమిళనేలలో వరదలా వెల్లువలై ఎగసి ప్రవహించింది. తెలుగు అక్షరాల పంటను పండింపచేసింది.

గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరాబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను - బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి- అని ధూరేణువులన్నీ కలకలలాడాయ్. తమిళనాట తెలుగు అక్షరాల పంటలు పండాయి- అంటే ఆ ఘనత సాధు వరదరాజు పంతులుదే!

తోటివారంతా అపహాస్యం చేసారు. తెలుగు పిచ్చివాడన్నారు. అయినా వీటివేటినీ పట్టించుకోలేదు. తమిళనాడులో కొడిగడ్తున్న తెలుగు దీపం జాజ్వలమానంగా వెలుగులీనాలంటే వరదరాజు పంతులువంటి మాతృభాషాభిమానులు మరలపుట్టాలి అనిపించాడు.

వరదరాజ పంతులుగారు తిరునల్వేలి జిల్లాలోని వీరరాఘవపురంలో సాధురామకృష్ణయ్య పంతులు గారింట 1889 ఆగస్టు 20 తేదీన జన్మించారు. ఆయన ఎట్టియాపురం సంస్థానంలోని రాజుల వద్ద దివాన్‌గా పనిచేసారు. ఎట్టియాపురం రాజులు తెలుగువారు కావడం, వారికి సాహిత్య కళాభిరుచి అమేయంగా కలవారవడం వలన- తెలుగు సాహిత్య సంగీతాలను రెండుచేతులా పోషించారు. ఆంధ్ర మహాభారతాన్ని తమిళంలో వచనరూపంలో అనువదింపచేసి ప్రచురించడానికి సహకరించారు. వారి తండ్రి రామకృష్ణయ్యపంతులుగారు సంస్థానంలోని వివిధ శాఖల్లో ఉద్యోగం చేయడం కూడా వరదరాజు పంతులుగారు ఉభయభాషా సేవకెంతో ప్రయోజనం చేకూరింది. తమిళంలో అనర్గళంగా మాట్లాడడం, చదవడం, వ్రాయడం వారికి కరతలామలకమయింది. రెండు భాషలపై వున్న పట్టు రెండు భాషలల్లోనూ ప్రవీణున్ని చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో తమిళం నేర్చుకుని తమిళ శబ్దకోశాన్ని తీర్చిదిద్దారు. ఆ విశ్వవిద్యాలయంలోనే ఓ చిన్న గుమస్తాగా ప్రవేశించి మేనేజర్‌స్థాయికి ఎదిగారు. ఉద్యోగవిరమణ వరకూ ఆ పదవిలోనే ఉన్నారు.

తమిళ నిఘంటువు కార్యాలయంలో పనిచేస్తున్నప్పటికినీ తెలుగు మీద అపారమైన వాత్సల్యం కలిగింది. తెలుగు మాట్లాడడం వచ్చినా- ఆయనకు వ్రాయడం, చదవడం రాదు; తెలుగు సాహిత్యంతో అసలు పరిచయం లేదు; అందుకాయన నిరుత్సాహపడలేదు. నిరంతర నిర్విరామకృషితో తెలుగు లిపిని చదవడం, వ్రాయడం నేర్చుకున్నారు. రోజూ ఆంధ్రదినపత్రికను చదువుతూండడ మొకటే ఆయనకు లిపి తెలిసింది. చదవడంతోబాటు, వ్రాయడం నేర్చుకున్నారు. తెలుగుశతకాలను బట్టీపట్టడం ప్రారంభించారు. కందుకూరి వీరేశలింగం రచనలు, భాస్కర రామాయణం, పోతన భాగవతం చదివే స్థాయికి ఎదిగారంటే వారు అనుదినమూ ఆంధ్రపత్రికను చదివేవారు. కాశీనాథునివారు ఆంధ్రపత్రికను అచ్చుతప్పులూ, అపభ్రంశలూ లేని పత్రికగా తీర్చిదిద్దడమే వారి తెలుగు ప్రామాణికతకు కారణమయింది .ఆంధ్ర పత్రికను దినదినమూ చదువుతూ, ఇంట్లోనివారికి ఆ పత్రిక భాషా శైలిని చెప్పేవారు.

వరదరాజం పంతులుగారి భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు శివసుబ్రహ్మణ్యం అలా నేర్చుకుని ఆంధ్రభాషలో ప్రావీణ్యతను సంపాదించారు. వారూ పంతులు గారితోబాటు తెలుగు భాషా వ్యాప్తికి బహుముఖంగా కృషి చేసారు. ఊరూరూ, గుమ్మగుమ్మమూ యెక్కి తెలుగు భాష వ్యాప్తికి విశేష కృషిచేసిన వాడు వరదరాజు పంతులేనని యిప్పటివారికి తెలియకపోవచ్చు. తమిళనాడులో చాలా మంది తెలుగువారున్నప్పటికినీ, వారికి తెలుగు అక్షరం చదవడం రాదు; వ్రాయడం అసలే అలవాటు లేదు.

తంజావూరులోని మహారాష్ట్రులకు తెలుగు అంటే ఎంతో ఇష్టం. తెలుగు వాక్యాలను తమ లిపిలో వ్రాయించుకుని చదివేవారు. ఆంగ్లేయులు సంస్కృతాన్ని రోమన్‌లిపిలో ముద్రించుకునేవారు. బ్రౌను వంటి తెల్లదొరలకు తెలుగు అంటే చాలా యిష్టం. తెలుగు పండితుల్ని చుట్టూ ఉంచుకుని తెలుగును నేర్చుకున్నారు. ఆయన పండితుల్ని పిలిపించుకుని వ్యాకరణమునే సంస్కరించారు.

వరదరాజు పంతులుగారి అనన్యకృషితో తమిళనాడులోని తెలుగు భాష యాసనే మరచిపోయి అచ్చతెలుగులో మాట్లాడారంటే- అది వరదరాజు పంతులు అనన్య కృషేనని చెప్పాలి. ఆయన్ను ఆనాడు దక్షిణాంధ్ర పితామహ, భాషోద్ధారక అను అనేక బిరుదములిచ్చి గౌరవించారు. 1972 సంవత్సరంలో 83 యేట ఆయన కాలధర్మం చేశారు. అయినా ఇప్పటికీ ఆయన ప్రాతః స్మరణీయుడే! ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది

అంబికా దర్బార్‌బత్తి



మధుర మీనాక్షి ఆలయం శిల్పకళా మధురం!

మనం మధుర అంటాం. తమిళులు మదురై అంటారు. ఎవరెలా పిలిచినా అమ్మవారిపేరు మధురంగానే ఉంటుంది. ఆమె పేరు మధురమైనప్పుడు, అయ్యవారు సుందరేశ్వరుడి రూపం మధురమైనప్పుడు, ఆలయ శిల్పకళా సంపదా మధురమైనప్పుడు... మదురైలో మాధుర్యం లేనిదెక్కడ?

జీవితంలో ఒక్కసారైనా మధుర మీనాక్షి ఆలయాన్ని చూసితీరాలి. తంజావూరు నాయకరాజులు ఆ ఆలయాన్ని నిర్మించడానికి నూట ఇరవై ఏళ్లు పట్టింది. ఎంత ఖర్చు పెట్టారనే విషయం చెప్పడానికి లెక్కేలేదు.

మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయ నిర్మాణం వెనుక ఓ కథ ఉంది.

మదురై పాలకుడైన మలయధ్వజ పాండ్యుని భక్తికి మెచ్చి అమ్మవారు చిన్నారిలా మారిపోయి వెంట వచ్చేస్తున్నది. పెరిగి పెద్దయి మలయధ్వజుని వారసురాలిగా ప్రజారంజక పాలన సాగిస్తున్నది. ఈశ్వరుడు సుందరేశ్వరుడై భూలోకానికొచ్చాడు. ఇద్దరికీ మనువు కుదిరింది. వైకుంఠం నుంచి విష్ణువు కూడా బయల్దేరి వచ్చాడు. ఏవో ఆటంకాలతో సకాలంలో చేరుకోలేకపోయాడు. అంతలో పెళ్లయిపోయింది. ఇంకెవరో పెళ్లిపెద్దగా వ్యవహరిస్తారు. విష్ణువుకు కోపమొస్తుంది. మధురైలో కాలుపెట్టనని ప్రతిజ్ఞ చేస్తాడు. దేవతలొచ్చి బతిమాలాక కాస్త చల్లబడి కొత్తదంపతులు మీద అక్షింతలు చల్లుతాడు. ఆ ఐతిహాసానికి గుర్తుగా జరిగే ఉత్సవం 'చిత్తిరై తిరువిళా'.

ఆలయం ఎప్పటిదో చెప్పడానికి కచ్చితమైన ఆధారాల్లేవు. ప్రాచీన తమిళ సాహిత్యంలోనూ ప్రస్థావన ఉంది. వేల ఏళ్లనాటిదే కావచ్చు. మీనాక్షి సుందరేశుల ప్రాచీన ఆలయాన్ని 1310లో మాలిక్ కాఫర్ ధ్వంసం చేశాడు. నాయక రాజుల ప్రధాన మంత్రి ఆర్యనాథ మొదలియారు పునర్నిర్మించారు. తిరుమల నాయకుడు వన్నెలద్దాడు.

నలభై అయిదు ఎకరాల మధుర మీనాక్షి ఆలయ ఆవరణలో అడుగడుగునా కళాత్మకత వెల్లివిరుస్తుంది. మంటపాలూ, గోపురాలూ ఏ ఇంద్రలోకం నుంచో తీసుకొచ్చి ప్రతిష్టించినట్టుంటాయి. వేయి స్తంభాల మంటప రాజసాన్ని మాటల్లో చెప్పలేం.

నాలుగు గోపురాలూ... అద్భుతం. దక్షిణ గోపురానికో ప్రత్యేకత ఉంది. అక్కడున్న ఐదు స్తంభాలూ ఏడు స్వరాల్ని పలికిస్తాయి. పుష్కరిణి మెట్ల మీద కూర్చుని ఆలయ సౌందర్యాన్ని చూడడం ఓ అనుభూతి. ఆ నీటిలోనే బంగారు కలువ ఉంది. ఆలయంలోని చిత్రకళా సంపద చూడ్డానికి మరో రెండుకళ్లు అరువు తీసుకెళ్లాలి. మీనాక్షీ సుందరేశ్వరులది అనోన్య దాంపత్యం. స్వామివారి బంగారు విగ్రహం మీద మీనాక్షమ్మపెదాల గుర్తులు కనబడతాయి. ఆ గడసరి తనంతోనే సుందరేశ్వరుడి కోవెలను, అమ్మవారు తనపేరున రాయించుకున్నారు. ఈశ్వరుడు 'మీనాక్షమ్మగారి మొగుడి'గానే మిగిలి పోయాడు.

దక్షిణ భారతదేశం ఆలయవైభవాలకు నిలయం. మదురై, కుంభకోణం, రామేశ్వరం, తిరుచ్చి, శ్రీరంగం, తంజావూరు ఆలయాలు ఒక చిన్న కుగ్రామమంత విస్తీర్ణంలో ఉంటాయ్. ఆలయ చతుర్దిశల్లోనూ ప్రవేశం ఉన్నది. ఏ దారి తనకు దారో మీనాక్షమ్మే నిర్దేశిస్తుంది. ●

01-10-1922 - 31-07-2004

పద్మశ్రీ డా॥ అల్లురామలింగయ్య గారి
మధుర స్మృతులలోని స్మృతి

అల్లు రామలింగయ్యా! నిన్ను మరువలేమయ్యా!

అల్లు రామలింగయ్యకు పాలకొల్లు వాళ్లంటే ఎంతో ప్రాణం!!

పాలకొల్లు వాళ్ళెందరో తెలుగు సినిమా రంగానికి వచ్చారు. నటులుగా వచ్చిన వారిలో తొలితరంవాడు అల్లు రామలింగయ్య. డా॥ రాజారావుగారి 'పుట్టిల్లు' చిత్రంతో ఆయన సినిమారంగాన్ని 'పుట్టిల్లు' చేసుకున్నారు. పుట్టిల్లు పాలకొల్లు నుంచీ చెన్నయ్ సినిమారంగం వచ్చిన వారందర్నీ తనయింటి వారుగానే గౌరవించడం, ప్రేమించడం ఆయన ప్రధాన ధర్మంగా భావించారు. ఏ మంచి కార్యం మా యింట వచ్చినా ప్రధానంగా వచ్చి ముందు వరుసలో ఉండేవారు. నేనే విషయం వచ్చినా– ఆయన సలహాను తీసుకునేవాణ్ణి. ఆయన కుమారుడు అరవింద్ విద్యా విషయం వచ్చినప్పుడు– నేను, ఆయనా, కలిసి నాగయ్యగారి వద్దకు వెళ్లాం.

చిరంజీవికి తన కుమార్తెనిచ్చి వివాహం చేసినప్పుడు మా పాలకొల్లువారందర్నీ ఒకే చోట కూర్చోపెట్టడమే గాకుండా మమ్మలినందరినీ విందు భోజనానికి దగ్గరుండి తీసుకుని వెళ్లారు.

అప్పటికి చిరంజీవి పెద్ద స్టార్ కూడా కాదు. రామలింగయ్య కుమార్తెతో పాణిగ్రహణమైన తరువాతనే అతని జాతకం ఉచ్ఛస్థితికి వెళ్ళింది. చిరంజీవి విజయసోపానంలో అల్లు రామలింగయ్య కుమార్తె పాదం మోపడంలోనే చిరంజీవి సినిమా జీవితం తారాస్థాయికి ఎగసింది.

సాధారణ జీవితంలో కూడా మనుషుల్ని గలగలా నవ్వించడంలో రామలింగయ్య ఘనాపాటి. అప్పట్లో నేను నిర్వహించిన 'మధురవాణి' పత్రిక అంటే ఆయనకెంతో యిష్టం. ఉచితంగా పత్రికను అందుకోవడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఆయన మా ఇంటికి వచ్చి ముందుగా వచ్చే సంవత్సరానికి కూడా సాలు చందాయిచ్చి వెళ్ళేవాడు. ఏ శుభకార్యం వచ్చినా ముందుగా కూర్చునేవాడన్న విషయం ముందుగానే చెప్పాను. ఆయనొక్కడు వస్తే నాకు పాలకొల్లువారంతా వచ్చినంత సంబరం కలిగేది.

రెండుసార్లు 'పుట్టిల్లు' సినిమా చూసిన దర్శకపితామహుడు హెచ్.ఎం.రెడ్డి గారికి అల్లు రామలింగయ్య నటించిన పాత్రపైనే దృష్టిపడింది. వెంటనే తాను రోహిణీ సంస్థ చిత్రంలో అల్లురామలింగయ్యకు తగిన పాత్రలు యిచ్చారు రోహిణీ సంస్థ చిత్రంలోని పాత్ర వేళా విశేషమేమోగాని, ఆ చిత్రం నుంచీ రామలింగయ్య ఏ చిత్రంలోనూ వేషం కోసం అర్థించిన అవసరమే కలుగలేదు. చలన చిత్ర సీమలో అప్పటికిఎంతోమంది హాస్యనటులున్నప్పటికినీ, రామలింగయ్య కంటూ ఓ పాత్రను సృష్టించిన సినిమాలు కూడా ఉన్నాయ్.

రామలింగయ్య నటించే పాత్రలు ఓ కొత్త తరహాలో ఉండేవి. ముఖ్యంగా జంధ్యపు పోగుగల బ్రాహ్మణ పాత్రల్లో ఆయన ఎన్నో సహజ లక్షణాలను తీసుకుని వచ్చేవారు. ఆయన మా పాలకొల్లు గరువు మీద ఉన్న ఓ ముసలాయన్ను మూసగా చేసుకుని నటిస్తూ సినిమా రంగ ప్రవేశం చేసారు. సహజత్వానికి దగ్గరగా ఆయన తీసుకున్న పాత్ర పోషణా విధానంలో ఓ ప్రత్యేక పోకడ కనిపించింది.

ఆయన మా పాలకొల్లులో ప్రదర్శింపబడిన 'అల్లరి సూర్యం' నాటకాన్ని చూచి విచిత్ర పోకడగల హాస్యనటునిగా రూపొందగలడని ఆనాడే భావించాను. అందుకు తగినట్లుగానే ప్రజానాట్యమండలి నాటకాల్లో పాత్రలు లభించాయ్. ప్రజానాట్యమండలి మూలస్తంభమైన డా॥ రాజారావుగారి 'పుట్టిల్లు' చిత్రం ఆయన్ను తెరనటుడుగా రాణించేట్లు సానబెట్టింది. ఆయన కమ్యూనిస్టు పార్టీ అభిమాని కావడం, కమ్యూనిస్టుల ప్రచార ధోరణికి ప్రజానాట్యమండలి ప్రధాన సాధనం చేసుకోవడంతో రామలింగయ్య నటన సునాయసంగా సినిమా రంగంలో ప్రవేశింపచేసింది.

సినీమా రంగంలో వైవిధ్యమైన పాత్రలు ధరిస్తూ– స్వంతంగా సినిమాలు తీసే స్థాయికి ఎదిగాడంటే– రామలింగయ్య అకుంఠిత కృషీ, నలుగురితో చనువుగా మాట్లాడడమే! అదే ఆయన్ను నటునిగా, నిర్మాతగా నిలబెట్టింది. చివరి శ్వాసవరకూ నటించడమే గాకుండా శ్వాస విడిచిన తరువాత కూడా సన్నిహితుల హృదిలో ఆయన శాశ్వతంగా నిలిచిపోయాడు. ●

Beautiful City - Beautiful Hotel



Forevear your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర

మన జాతి మూలాలను స్పృశించే ప్రయత్నంలో జాతిమూలాలు వెదకాలి. దిగంతాలను తాకిన తెలుగుజాతి వైభవాన్ని విశిష్టతని అమూలాగ్రం ఆవిష్కరించే ప్రయత్నం చేయాలి. చారిత్రక విభాత సంధ్యల భాషా వికాసమెట్టిది? అని ప్రశ్నించాడు మహాకవి శ్రీశ్రీ. సుదూర గతంలో తెలుగు జాతి వికాసమెట్టిదో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామా? ఆశతో– ఆర్ద్రతతో... ఆవేశంతో.. అభినివేశంతో తొలి తెలుగువారు ఎన్నిటికో శ్రీకారం చుట్టారు. నాణేల ముద్రణలోనూ సుదూర రోమ్‌తో వ్యాపారంలోనూ మనమే ముందడుగు వేసాం. మూడు సముద్రాల నౌకా యానంలోనూ మనమే దూసుకువెళ్ళాం. భారతావనికి శిల్పాన్ని... చిత్రాన్ని నేర్పింది మనమే! క్రీస్తుకు పూర్వమే మహాసామ్రాజ్యాన్ని స్థాపించింది మనమే. ఇది అతిశయోక్తీ కాదు, అభూతకల్పనా కాదు. మన పూర్వీకులు అందరూ పక్కా ప్రణాళిక ఉన్నవారు.. తమ ప్రతిభకు సంబంధించిన ప్రతి ఆనవాలునీ భావితరాల కోసం భద్రంగా దాచిపెట్టారు. మనసునిండా గర్వంతో – ఉప్పొంగిన ఉత్సాహంతో గత ప్రయాణాన్ని చూద్దాం.

భారతదేశంలో మొట్టమొదటగా ఎన్నిటినో ఆవిష్కరించింది తెలుగువారే! ఎంతమంది ఎన్నిరకాలుగా మన ఘనకీర్తిని పాతరేసినా... ఎన్ని విధాలుగా తొక్కేసినా ఇది పచ్చి నిజం.. మన పూర్వీకులు సాక్ష్యాధారాలతో సహా తమ ఆనవాళ్ళను భద్రపరిచారు... వీటిని ఒక్కొక్కటిగా వెలికితీయడమే కాదు, మీకు వివరంగా వివరిస్తున్నాం.

తరగని వెలుగు, తగ్గని జాబిల్లి, కరగని చెరగని పున్నమి, తనివితీరని తీయ తేనియ పాల పాయసం, తెలుగుదం. మనసుకి మామిడాకుల తోరణాలు కట్టిన సంబరం తెలుగుదం. తెలుగు వెలుగుల సోయగం పైన కాస్తే వెన్నెలౌతుంది. పందిరేస్తే మల్లెలా సౌరభిస్తుంది.

పద్యం మనది! గద్యం మనది! చిత్రం మనది! శిల్పం మనది!
పంచెకట్టు మనది... పరికిణి ఓణి మనది
హరికథ మనది! కళమనది! బుర్రకథ మనది! కూచిపూడి నాట్యం మనది!

అవధానం మనది! అందమైన నుడికారం మనది! అచ్చమైన వెటకారం మనది! ఆవకాయ మనది! గోంగూర మనది... గోదావరి మనది, కూచిపూడి మనది... కృష్ణమ్మ మనది... పెన్నానది మనది! ఉత్తుంగ తుంగ మనది.

త్యాగయ్య రాగం మనది... క్షేత్రయ్య పదం మనది! అన్నమయ్య జానపదం మనది.. పువ్వులా నవ్వేటి తెలుగు మనది! తెలుగు నేలని చూస్తూ కళ్ళు కవిత్వం పాడుతాయి తెగులు జాతి చరిత్ర తిరగేస్తే. ఒళ్లు పులకరిస్తుంది. ఈనేలా.. ఈ గాలీ... అనాదిగా తెలుగు నాగరికతతో ఓనమాలు దిద్దించాయి.

రాజనాలు పండించే రాగాల గోదావరి.. పండ్లు పూలు పసుపు పారాణి రాణి కృష్ణవేణిలు తెలుగింటి కలికింటి తేనెలమ్మలు... సిరిసంపదలతో తులతూగేలా తెలుగింటిని తీరిదిద్దాయి. కళల కాణాచిగా మెరుగులద్దాయి.

సంగీత సాహిత్యాలతో సొబగులద్దాం. వ్యాపార వాణిజ్యాలతో వృద్ధి చేశాం.. దేశం మొత్తంలో వస్తుమార్పిడి విధానానికి చెల్లుచీటీ ఇచ్చి... నాణేలను మొదట చెలామణీకి తెచ్చింది తెలుగు రాజులే! భారతదేశంలో అతిపెద్ద నాణేల నిధి 1934లో కృష్ణా జిల్లాలోని సింగవరంలో బయల్పడింది. సింగవరం నిధిలో పదివేల తులాల వెండి నాణేలు లభించాయి. నాణేల మీద గుర్తులు, తయారీ విధానాన్ని పరిశీలిస్తే తెలుగు పాలకుల తర్వాతే, మగధ, నంద, మౌర్య వంశపు రాజులు తమ తమ నాణేలను విడుదల చేశారు. దేశంలో అశోకుడితో పాటు ఏ చక్రవర్తి చేయని సాహసం మన కోటిలింగాల రాజులు చేశారు. నాణేలపై తమ పేర్లను అచ్చువేయించుకుని నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ మొదలుపెట్టిన మొదటి రాజు గోబధ, బ్రాహ్మీ లిపిలో గోబధ పేరు నాణెం మీద ఉండడం విశేషం. నరన, కంవాయ, సిరివాయ, సమగోప అనే స్థానిక రాజులు తమ పేర్లతోబాటు తమ హోదాలను తెలుపుతూ, నాణేలను అచ్చువేయించారు. విదేశీ రాయబారులు తెలుగునేల గొప్పతనాన్ని అప్పట్లోనే వేనోళ్ల కొనియాడారు. క్రీస్తుపూర్వం అయిదో శతాబ్దిలో భారతదేశానికి వచ్చిన గ్రీక్ రాయబారి మెగస్థనీస్ ఆంధ్రరాజుల వైభవాన్ని కీర్తించాడు. లక్షపదాతిదళం, వేయి ఏనుగులు.. ముప్పైకంటే ఎక్కువ కోటలుగల నగరాలు ఆంధ్ర రాజన్యుల సొంతమని మెగస్థనీస్ రాతల ఆధారంగా ఇండికా గ్రంథం పేర్కొన్నది. పంతొమ్మిదో శతాబ్దిలో మన దేశానికి వచ్చిన మెడోస్ టైలర్స్ తన ఆత్మకథ సురపురం చరిత్రలో భారతదేశంలో అతి పెద్దదీ, శక్తివంతమైనదీ గోల్కొండ సంస్థానం అని రాశాడు. అంటే క్రీస్తుకు పూర్వం అయిదో శతాబ్దిలోనే కాదు పంతొమ్మిదో శతాబ్దిలో కూడా తెలుగు నేల ఎంత శక్తిమంతంగా ఉండేదో తెలుసుకోవాలంటే సహస్రాబ్దాల క్రితమే తెలుగు ప్రజలు విదేశాలతో వ్యాపారం చేసి సిద్ధహస్తులు అనిపించుకున్నారు. అంతర్జాతీయ నౌకావర్తకంలో శాతవాహనులది అందెవేసిన చేయి. పట్టు, నూలువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను రోమ్‌కు ఎగుమతి చేసేవారు. అరేబియా సముద్రతీరాన ఉన్న సుర్‌పుర నేటి సూరత్... బ్రూచ్ కల్యాణ్‌లలో నౌకాశ్రయాలను మనవాళ్లే నిర్మించారు. మౌర్య సామ్రాజ్య పతనం తరువాత దక్షిణాపథం నుంచి విస్తరించిన శాతవాహన సామ్రాజ్యమే మన రాజ్యం... మా గుర్రాలు మూడు సముద్రాలలో నీళ్లు తాగాయి అని గర్వంగా మన శాతవాహన వీరులు ప్రకటించుకున్నారు.

ఆంధ్రదేశం అన్నపూర్ణ. కేవలం పాడిపంటలు, ధనధాన్యాలే కాదు మణి మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలకూ నెలవే...! కృష్ణ తుంగభద్ర లోయలపై మౌర్యులకు ప్రత్యేక శ్రద్ధ ఉండడానికి కారణం ఇక్కడ నిక్షిప్తమైన బంగారు వజ్రాల గనులే! అశోకుడి శాసనాలు 14 మన నేలపై దొరకడమే దీనికి నిదర్శనం. కృష్ణా జిల్లా కొల్లూరులో లభించిన వజ్రమే ప్రపంచ ప్రసిద్ధిగన్న కోహినూరు వజ్రం. నేటికీ బ్రిటిష్ రాణి కిరీటంలో కొలువై నిలచింది. శాతవాహన చక్రవర్తుల్లో గౌతమీపుత్ర శాతకర్ణి అత్యంత ప్రముఖుడు. ఇతడి కాలంలో శాతవాహన సామ్రాజ్యానికి ఉత్తరాన రాజపుత్రస్థానం, దక్షిణాన మైసూరు, తూర్పున బంగాళాఖాతం పశ్చిమాన అరేబియా సముద్రం సరిహద్దుగా ఉండేవి. నాగరికతకు వేగుచుక్క లాంటి తెలుగునేల ప్రపంచంలో మొట్టమొదటి చుక్కానిని కనిపెట్టింది. గుంటూరు జిల్లా చేబ్రోలులో యజ్ఞశ్రీ శాతకర్ణికి చెందిన 12 ఓడ నాణేలు బయటపడ్డాయి. వాటిమీద మూడు తెరచాప కొయ్యలూ, ఒక చుక్కాని ఉంది. 14 శతాబ్దికి కానీ యూరోపియన్లకు చుక్కాని గురించి తెలియదు. గౌతమీపుత్ర శాతకర్ణి శక చక్రవర్తి విక్రమాదిత్యను క్రీస్తు పూర్వం 78లో ఓడించి శక సంవత్సరానికి నాంది పలికాడు. ఈ క్యాలెండర్‌ను గుజరాతి, మరాఠీ, కన్నడ, తెలుగు ప్రజలు ఈనాటికీ వినియోగిస్తున్నారు. ఇది భారత జాతీయ క్యాలెండర్‌గా పేరుతెచ్చుకుంది... తెలుగు జాతిచరిత్ర... గత కాల స్మృతి చందనాలను చల్లగా మన హృదయానికి పూస్తుంది. కృష్ణ, గోదావరి నదీమతల్లుల నుంచి అన్ని కళలను ఔపోసన పట్టిన ప్రజ తెలుగు ప్రజ. ప్రపంచానికి మార్గదర్శిగా మారింది... క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెందిన గుహాలయాలు దక్షిణ భారతదేశంలోని రాక్ కట్ కేవ్ టెంపుల్స్‌కు అంకురార్పణ చేశాయన్నది పురాతత్వవేత్తల అభిప్రాయం... దేశంలో అశోకుడు నిర్మించిన మొట్టమొదటి రాతి కట్టడం సాంచి స్థూపం. ఈ స్థూపానికి అద్భుతమైన ద్వారతోరణాలను నిర్మించినది శాతవాహన శిల్పులే! మౌర్యుల కాలంలో శిల్పాలు లేని స్థూపాలు మాత్రమే ఉండేవి. కానీ అమరావతి స్థూపంలో అద్భుతమైన శిల్పాలు కన్పిస్తాయి. దేశవ్యాప్తంగా శిల్పాకృతులకు నాంది పలికింది మన తెలుగువారే! ఇదే అమరావతి స్కూల్ ఆఫ్ ఆర్ట్‌గా ప్రపంచం అంతా ప్రసిద్ధి చెందింది... క్రీస్తు పూర్వం 3వ శతాబ్ది నుంచి క్రీస్తు శకం రెండో శతాబ్ది వరకూ అమరావతి స్థూప నిర్మాణం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కట్టడాలకు స్ఫూర్తిగా నిలిచింది.

తెలుగు శిల్పులు శిల్పాల్లో కవితలు అల్లారు అనడానికి ఇవే సాక్ష్యాలు.. కాంబోడియాలోని అతి పెద్ద హిందూ దేవాలయం అంగ్‌కార్ వాట్‌కు.. ఇండోనేషియాలోని రాతి బౌద్ధస్థూపం బోరబోడూర్‌కు అమరావతి శిల్పమే ప్రేరణ. రోమన్ దేశీయుడు ప్లీనీ రాతలను బట్టి ఓ విషయం స్పష్టం అవుతోంది.. ప్రతి సంవత్సరం భారతదేశానికి 5 కోట్ల సిస్టర్‌సెస్‌లు అంటే ఓ కోటి 25 లక్షల దీనారాలు రోమను సామ్రాజ్యం నుంచి చేరేవి. దక్షిణాది రాష్ట్రాలన్నిటి కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా రోమను బంగారు, వెండి నాణాలు లభించాయి. అంటే ఆనాడు రోమ్‌తో మన తెలుగునేల ఎంతగా వ్యాపారం చేసిందో అర్థం చేసుకోవచ్చు. నాణేల ముద్రణలో ఆనాటి తెలుగునేల ఓ ప్రత్యేకతను కలిగి ఉంది. మిగతా

దేశమంతా నాణేలను రాగితో తయారు చేస్తుంటే మన ప్రాంతంలో మాత్రం సీసంతో తయారు చేశారు. హైదరాబాద్ మ్యూజియంలో భద్రపరచిన 38,512 శాతవాహనుల నాణేలలో 21,529 నాణేలు సత్తువే...! సీసంతో కూడా నాణేలు తయారుచేయగలిగిన ప్రజ్ఞ శాతవాహనుల సొంతం.. పుణేలోని కార్గె.. ముంబాయిలోని కన్హేరి గుహాలయాలు శాతవాహనులు నిర్మించినవే.

యావద్భారత దేశానికి చిత్రలేఖనాన్ని నేర్పించిందీ మన తెలుగువాళ్లే. దేశంలోనే అతి పురాతనమైనవిగా పేరు తెచ్చుకున్నాయి. అజంతా కేవ్ పెయింటింగ్స్.. వీటిలో తొలినాటివి 9, 10 గుహలు... ఇవి క్రీస్తు పూర్వం రెండో శతాబ్దికి చెందినవి... వీటిలో ఉన్న కుడ్యచిత్రాలు శాతవాహనుల కాలంలో వేశారని ఆర్కియాలాజికల్ సర్వేలు తేల్చి చెప్పాయి. ఆనాడు అజంతా బౌద్ధయాత్రికులకు తీర్థస్థలం... బౌద్ధధర్మంతో పాటు ఈ చిత్రకళ కూడా వివిధ దేశాలకు వ్యాపించింది... శ్రీలంకలోని సిగిరియా కొండమీద.. నేపాల్, టిబెట్‌లోని టాంకా చిత్రాలకు ప్రేరణ అజంతా శిల్పాలే... శాతవాహనుల కాలంలోనే వివిధ వస్తువుల వ్యాపారం చేసేవారు. వారు వేరు వేరు వర్తకశ్రేణులుగా ఏర్పడ్డారు. అంటే నేటి ట్రేడ్ యూనియన్లకు ఈ సంఘాలే స్ఫూర్తి... శాతవాహనుల కాలంలోనే వాత్స్యాయనుడి కామసూత్రం రూపుదిద్దుకుంది. అమరావతి, నాగార్జున కొండ శిల్పాలలో నాట్య భంగిమలు ఎన్నో ఉన్నాయి. అంటే ఆనాటి మన తెలుగునేల సంగీతనృత్య కళలలో ఎంత పరిణతి కలిగి ఉండేదో ఊహించవచ్చు. బుద్ధుడి తరువాత అంతటివాడిగా రెండో బుద్ధుడిగా ఆచార్య నాగార్జునుడు పేరుతెచ్చుకున్నాడు. చైనా, టిబెట్, భూటాన్, నేపాల్, థాయిలాండ్, కొరియా, జపాన్‌లకు బౌద్ధం వ్యాపించడానికి కారకుడు నాగార్జునుడే.. ఆయా దేశాల్లో నాగార్జునుడి స్వర్ణ విగ్రహాలు ఈనాటికీ నిత్యపూజలు అందుకుంటున్నాయి. ఆనాటి విజయపురి నేటి నాగార్జున కొండ. దేశంలో మొట్టమొదటి విశ్వవిద్యాలయం అక్కడే ఏర్పడింది. ఆ విశ్వవిద్యాలయం క్రీస్తు శకం 3వ శతాబ్దికి చెందింది. ఇక్కడ చదువుకోవడానికి 14 దేశాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. విద్యార్థులందరికీ ఉచిత భోజన సదుపాయం ఉండేది. ఈ స్టేడియమ్ క్రీస్తుశకం మూడో శతాబ్దికి చెందింది. అంటే రోమ్‌లో నిర్మించిన రెండు వందల ఏళ్లకే తెలుగునేలపై స్టేడియం వెలసింది. జెన్ బుద్ధిజం ఫౌండర్ బోధిధర్ముడు తొలి పల్లవ రాజకుమారుడు. తొలి పల్లవులు తెలుగువారు. పల్నాటికి చెందినవారు. కంపూ విద్య సృష్టికర్తగా కూడా బోధిధర్ముడు విఖ్యాతి చెందారు. ప్లినీ చరిత్రకారుడి నాచురల్ హిస్టరీలోనూ, హిప్పాలస్ రచించిన పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీలోను, టోలమీ భూగోళ శాస్త్రంలోనూ మన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రాచీన నౌకాశ్రయాల గురించి ఉంది. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం ఖండఖండాలలో వలసలను స్థాపించింది. కానీ తెలుగువారు బ్రిటీష్ సామ్రాజ్యం కళ్లుతెరువక ముందే వలస రాజ్యాలను స్థాపించారు. క్రీస్తు పూర్వమే వర్తక వ్యాపారాల పేరుతో దూరతీరాలకు వెళ్లడం ప్రారంభించారు. ప్రాచీన తెలుగువారు సువర్ణభూమి అన్న పేరున్న మయన్మార్‌లో రాజ్యం స్థాపించారు. వీరి తలైంగులంటారు. ఎప్పుడు వలసపోయారో తెలిపే ఆధారాలు లేవు కానీ బర్మాచరిత్ర తలైంగులు చాలా గొప్పవారని మాత్రం తెలియజేస్తుంది. తలైంగుల యాంగన్‌లోని ష్వేడగాన్ పగోడా.. బెగోలోని ష్వేమాన్ డా పగోడా.. తటోన్‌లోని ష్వేజయాన్ పగోడాలను నిర్మించారు. ఉత్తర థాయ్‌లాండ్‌కు నాగరికతను పరిచయం చేసిన రాణి ఛామదేవి. ఈమె తలైంగుల జాతికి చెందిన స్త్రీ.. బుద్ధుడితో సమానంగా ఛామదేవి విగ్రహాలకు పూజలు చేయడం ఇక్కడి విశేషం...

ఈ మూన్ జాతీయుల బంధువులను కాంభోజ దేశం అంటే నేటి కాంబోడియా ఖ్మేర్‌లుగా పిలుస్తున్నారు... కాంబోడియాకి ఉత్తరాన అన్నాం. ఇండో చైనా రాజ్యాలున్నాయి... వీటికి పూర్వపు పేరు చంపాదేశం.. ఇక్కడ మొదట వలస రాజ్యం స్థాపించింది తెలుగువారు... చంపాదేశంలో కనబడే ప్రాచీన లిపి, తెలుగు దేశంలో క్రీ.శ. ఒకటి రెండు శతాబ్దాల నాటి ప్రాచీన బ్రాహ్మీలిపి.. ఇలా మన తెలుగువాళ్ళు ఎక్కడెక్కడికో వెళ్లారు... ఎన్నో విజయాలను సాధించారు.

మన తాతముత్తాతలు మన భూమిలాంటి కర్మ భూమి...

మన విజ్ఞానం లాంటి గొప్ప విజ్ఞానం..

మన నాగరికత లాంటి గొప్ప నాగరికత ప్రపంచంలో మరెక్కడా లేవని నిరూపించారు... తమ విజ్ఞానాన్ని ప్రపంచానికి పంచిపెట్టారు మహా సామ్రాజ్యాలను స్థాపించారు. ఈ ఘనమైన గతకీర్తిని మనం ఓ సారి మనసుతీరా స్మరించుకుందాం.

-డి.పి. అనురాధ

(నడుస్తున్న చరిత్ర పత్రికకు కృతజ్ఞతలు)

కల్పవృక్షం!

-గుర్రాల రమణయ్య, నెల్లూరు

మహాత్మా నీ స్వాతంత్ర కల్పవృక్షం
కుక్కమూతి పిందెలు కాస్తూంది
బీర్లు బార్ల సామ్రాజ్యంగా వర్ధిల్లుతూ
అర్ధరాత్రి కుంకుల చేతలతో మార్మోగుతూ
ఇంకా చీకట్లోనే మూల్గుతూంది!
నీ రామరాజ్యపు కల కుక్కలు చింపిన విస్తరై
కర్షకుల ఆత్మహత్యలతో
నేతన్నల ఆత్మార్పణలతో
విద్యార్థుల ఆత్మహననాలతో
మదోన్మత్త మతోగ్రవాదుల చేతచిక్కిన
లేడిపిల్లలా విలవిలలాడుతోంది!
అర్ధరాత్రి స్త్రీ రోడ్లపైన సురక్షితంగా తిరుగాడినప్పుడే
స్త్రీ స్వాతంత్ర కమలపు రేకులు విప్పారినట్లు!
అర్ధరాత్రి నట్టనడి రోడ్లపైన
భారతనారి దాడికి గురై
మాన దోపిడికి బలై
కాముకకత్తులకి కుత్తుక సమర్పిస్తోంది!
అదిగదిగో నీ అహింసాపావురాయి
కువకువల సరిగమలు మరచి
వన్‌టూత్రీ ఫోర్‌ల వింతలయతో రెక్కలాడిస్తూ
కాలుష్యపు విశాల కోనేర్లపై
వింత వింతగా చక్కర్లు కొడుతోంది!
అరవై ఎనిమిదేళ్ల లగాయిత్తు
తలదాచుకొనే నీడలేక
కడుపుకు పట్టెడన్నం లేక
కట్ట జానెడు గుడ్డలేక
ఒక జాతి దశాంశలుగా తిరుగుతూనూ ఉంది
నీ స్వాతంత్ర్య కల్పవక్షం
కుక్కమూతి పిందెలు కాస్తూనే ఉంది!

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

రామా! నన్ను బ్రోవరా! శ్రీరామా! నన్ను బ్రోవరా! -అంటూ త్యాగరాజు కీర్తనలు రామునికి వినుతిగానే వీనుల విందొనరిస్తుంటాయ్!

170 సంవత్సరాల క్రితం ఇష్టదైవం శ్రీరామచంద్రునిలో లీనమైన సంగీత రారాజు త్యాగరాజు ఎన్నెన్నో కీర్తనలను ఎన్నెన్నో రాగాల్లో ఆలాపించారు!



అన్ని కీర్తనలూ శ్రీరాముని కీర్తిస్తున్నవే! జీవితాన్ని చరితార్థం చేసుకున్న వాగ్గేయకారుడు తిరుమల శ్రీనివాసుణ్ణి దర్శించి తెర తీయగ రాదా? నాలోని మత్సరమను తెరతీయగ రాదా? అని కీర్తించేసరికి శ్రీనివాసుని ఎదురుగా ఉన్న తెర తనకు తానుగా తొలగింది. ఆయన 1767 నుంచి 1847 వరకే జీవించారు.

త్యాగరాజ కృతులు ఆలపించని సంగీత విద్వాంసులు లేరు. ఆయన పంచరత్న కీర్తనల్ని ఆలపించనివారు సంగీత విద్వాంసులూ కారు.

ఆయన 1847 సం॥ము జనవరి 6 కృష్ణపక్షం పంచమినాడు శ్రీరామునిలో ఐక్యమయ్యారు. కానీ ఈనాటికినీ ఆయన కీర్తనలు సంగీత విద్వాంసుల గళం నుంచీ రవళిస్తూనే ఉన్నాయ్. త్యాగరాజు కీర్తనల్ను వింటూనే తరిస్తున్నాం. తిరువాయూరులో వారి సమాధిని చూచి పులకించి పోయాను. కావేరీ తరంగాలు ఉవ్వెత్తున ఎగిసాయ్! ●

హేరామ్ అంటూ ప్రాణాన్ని విడిచారు!

కొల్లాయి గట్టితేనేమి! మా గాంధి మాలడై తిరిగితే నేమి? నాలుగు పలకలా పిలక! నాట్యమాడే పిలక అంటూ ఆంధ్రదేశం కీర్తించింది



రఘుపతి రాఘవరాజారామ్ ఈశ్వర అల్లాతేరేనామ్ సబ్‌కో సన్మతి హే భగవాన్ అన్నది ఆయన నిత్య ప్రార్థనా గానం. ఆ గానంలోనే పరవశించాడు. ఆ గానంలోనే పరమపదించారు.

1947 ఆగస్టు 14-15 అర్థరాత్రి

కొద్ది క్షణాల్లో ఆగస్టు 15 రాబోతుండగా తొలి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగం. ట్రిస్ట్ విత్ డెస్టినీ.

తల్లి కునుకు తీస్తున్నప్పుడు మేల్కొని కేరింతలు కొడుతున్న బిడ్డను కనిపెట్టుకుని ఉండే రెప్పలకు ఆహ్వానం అన్నారు నెహ్రూ.

గాంధీజీ అక్కడలేరు!

వగచిన యుగం అంతరించి, జాతి ఆత్మ వికసించిన ఈ నడిరేయిలో మళ్లీ ఒక ఒట్టుపెట్టుకుందాం. యావత్ మానవాళి క్షేమం కోసం కట్టుబడి ఉందామని అన్నారు నెహ్రూ.

గాంధీజీ అక్కడ లేరు.

ఇవాళ భారత స్వాతంత్ర్య దినం. 70వ ఇండిపెండెన్స్‌డే. 68 ఏళ్ల క్రితం బాపూజీ తన 78వ యేట ఒక అతివాది పేల్చిన బులెట్‌లకు నేలకొరిగారు. స్వతంత్ర భారతదేశపు తొలి ఉలికిపాటు అది. గాంధీ హత్య వార్త వినగానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్... 'ఇంతటి మహావ్యక్తి ఈ భూమి మీద నడిచాడా! మన మధ్య జీవించాడా అని భావితరాలవారు ఆశ్చర్యపోతారు' అని వ్యాఖ్యానించారు.

ఆయన జీవితమే... ఆయన సందేశం.

దేశవిభజనకు ముందు, తర్వాత, దేశంలో చెలరేగేగిన మత కలహాలు గాంధీజీని ఎంతో అశాంతికి గురిచేశాయి. స్వాతంత్ర్యానికి ముందు ఏడాది 1946లో ఆయన హిందూ ముస్లిం అల్లర్లలో శాంతి పునఃస్థాపనకు కలకత్తాలో పాదయాత్ర చేస్తున్నారు. 'బెంగాలీ ప్రజలకు సందేశం ఇవ్వండి' అని పాత్రికేయులు అడిగారు. ఆ రోజు గాంధీ మౌనవ్రతం. ఒక పలకమీద బెంగాలీ లిపిలో 'అమార్ జీబనీ అమార్ బానీ' అని రాశారు. 'నా జీవితమే నా సందేశం' అని దాని అర్థం. సత్యం, అహింస అనే ఆదర్శాలను ఆయుధాలుగా చేసుకున్న మహనీయుని జీవితం కేవలం సందేశం మాత్రమే అవుతుందా? దిక్సూచి కూడా అయింది. అగ్రరాజ్యాలు సైతం నేడు గాంధీ మార్గాన్ని అనుసరిస్తున్నాయి.

ఆయన స్వరూపం ఉద్యమం

గాంధీజీ జీవితానికి ఉద్యమస్వరూపం తప్ప మరో రూపం లేదు. వేరే రూపురేఖలు లేవు. ఈ భారతీయుడి జీవితం ఇంగ్లండ్‌లో మొదలైంది. దక్షిణాఫ్రికాలో పదును తేలింది. భారత్‌లో కదం తొక్కింది.

సముద్రయానం హిందువులకు నిషిద్ధం. నిషేధాన్ని ధిక్కరించి 'లా'చదవడం కోసం 1888లో గాంధీజీ ఇంగ్లండు వెళ్లారు గాంధీజీ. మూడేళ్లు లండన్‌లో ఉండి వచ్చారు. ముంబైలో 'లా' ప్రాక్టీస్ పెట్టారు. 1893లో దక్షిణాఫ్రికాలో ఒక భారతీయ ముస్లిం కంపెనీ దావాలో వాదించడానికి జూనియర్ లాయర్‌గా వెళ్లే అవకాశం వస్తే డర్బన్ బయల్దేరి వెళ్లారు. అలా వెళ్లడం వెళ్లడం దక్షిణాఫ్రికాలో 21 ఏళ్లు (1893-1914) గడిపారు. దక్షిణాఫ్రికాలో అనుభవాలు, అవమానాలు, పరాజయాలు, ఆయన్ని ఓ ఉద్యమశిల్పంలా చెక్కాయి.

ముప్పైఏళ్ల స్వదేశీ ఉద్యమం

1914లో దక్షిణాఫ్రికా నుంచి తిరుగు ప్రయాణమైన మధ్యలో కొన్నాళ్లు లండన్‌లో ఉండి, అక్కడ ఆరోగ్యం క్షీణించడంతో 1915లో గాంధీజీ ఇండియా చేరుకునే నాటికి... ఇక్కడ స్వాతంత్ర్య కాంక్ష ఉధృతరూపం దాలుస్తూ ఉంది. గాంధీజీ ఏడాదిపాటు దేశమంతా తిరిగారు. మొదట శాంతినికేతన్ వెళ్లి ఠాగూర్‌ని కలుసుకున్నారు. తర్వాత గుజరాత్ వచ్చారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ నదీ తీరాన ఒక ఆశ్రమం నిర్మించుకున్నారు. ఇండియాలో కూడా దక్షిణాఫ్రికాలోని పరిస్థితులే! తెల్లవాళ్లు, నల్లవాళ్లు, ప్రజావ్యతిరేక నిర్ణయాలు. ప్రభుత్వంపై ఉద్యమకారుల ఆగ్రహాలు. బీహర్‌లోని చంపారన్ జిల్లాలో నీలిమందు పండించే పేద రైతుల పట్ల తెల్లజాతి యజమానులు అనుసరిస్తున్న దోపిడీపై ప్రతిఘటనతో 1917లో భారత్‌లో మొదలైన గాంధీజీ ఉద్యమ జీవితం.. రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ ఉదంతం, సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమం, చౌరీచౌరీ ఘటన. సంపూర్ణ స్వరాజ్య తీర్మానం, ఉప్పు సత్యాగ్రహం, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఆమరణ నిరాహార దీక్ష, వంటి వాటితో 1932 నాటికి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన అధ్యాయం అయింది!

1933లో గాంధీజీ సబర్మతీ నుంచి మహారాష్ట్రలోని వార్ధా వచ్చి అక్కడ సేవాగ్రాం పేరుతో ఆశ్రమం నెలకొల్పారు. అక్కడే శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. హరిజన్ వార పత్రిక స్థాపించారు. హరిజనోద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఖాదీ ఉద్యమం ప్రారంభించారు. తర్వాత రాజకీయ ఉద్యమం 1942లో క్విట్ ఇండియా ఉద్యమం. బ్రిటిష్‌వాళ్ళు వెళ్లిపోయారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటికి గాంధీ వయసు 77 ఏళ్లు. 1917 నుండి 1947 వరకు 30 ఏళ్లు గాంధీజీ ఉద్యమ జీవితం గడిపారు.

'మహాత్మ' గాంధీ (78), భారత జాతిపిత

పూర్తిపేరు	: మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ
జననం	: అక్టోబర్2 1869
జన్మస్థలం	: పోర్బందర్ (గుజరాత్)
తల్లిదండ్రులు	: కరమ్‌చంద్ గాంధీ. పుత్లీబాయ్
తోబుట్టువులు	: లక్ష్మీదాస్, గోకిబెన్, కర్సన్‌దాస్
చదువు	: న్యాయశాస్త్రం
భార్య	: కస్తూర్బా (వివాహం 1883 మే)
సంతానం	: హరిలాల్, మణిలాల్, రామ్‌దాస్, దేవదాస్